## అనుమానం

"మీరు ఇట్లా ప్రవర్తిస్తారని తెలిస్తే నేను ఇల్లువిడిచి వెళ్లకపోదును. ఎంతో ముచ్చటపడి జాగ్రత్తగా దాచుకున్న జాకెట్టు ఇలా ఎందుకు నలిగిపోయిందో నాకు తెలుసు. ఈ సిల్కుచీరెకు మరకలు ఏలాపచ్చాయో అదీ తెలుసు. మీరు దాచటానికి ప్రయత్నించకండి. రహస్యం ఎప్పటికీ దాగదు. ఏ నాటికైనా బయల్పడుతుంది. మీరు మంచి బుద్ధిమంతులని, భార్యను పోషించుకోలేని అసమర్థులు కారని నా తల్లిదండ్రులు మీ మెడకు నన్నుకట్టారు. కానీ మీరుఇట్లా నీచంగా ప్రవర్తిస్తారని, నా జీవితాన్ని కన్నీటిలో ముంచుతారని అనుకోలేదు." శ్యామల కళ్లంబడి నిప్పురవ్వలు రాల్తున్నాయి. ఆమె అమాయకత్వానికి ఏడ్వాలో నవ్వాలో నాకేం అర్థంకాలేదు.

"ఎందుకీ బ్రతుకు? కళ్లతో చూస్తూ సహించలేను. మీ రేమైన అనండి. ఇటువంటి పనులకు వప్పుకోను. నలుగురిలో తలెత్తి తిరుగుతున్నారు. లోకం ఏమనుకుంటుందో అన్న భయంకూడా లేదు మీకు. మళ్లీ ఆ నవ్వెందుకు? నవ్వుతూనే కొంపల్ని కూల్చేస్తారు! విజ్ఞానాన్ని అలవరచుకుని హాయిగా బ్రతకవలసిన రోజులివి. అంతేగానీ దౌర్భాగ్యులతోకూడి ఉన్న పేరూ ప్రతిష్ఠలను నాశనం చేసుకోవడమా? పైగా జర్నలిష్టులు. ఇట్లా సంచరించమని చెప్తూందా మీ జర్నలిజం?"

నా నవ్వును ఆపుకోలేక పోయాను. నేను నవ్వుతూ అన్నాను. "శ్యామలా! నేనేమీ నీ జీవితాన్ని నాశనం చేయలేదు. అట్లా చేయటానికి ప్రయత్నించనూ లేదు. నీ అనుమానానికి కారణం నాకు తెలుసు. నువ్వు విప్పి చెప్పనక్కర లేదు. మేము 'రావ్‌బహదూర్' అన్న డ్రామాను వేశాం. అందులో నేను హీరోయిన్‌గా నటించాను. ఈ పువ్వుల జాకెట్టును, సిల్కుచీరెను ధరించాను. అంచేత ఇవి నలిగి ఉన్నయ్. అంతేగానీ నీ వనుకున్నట్టు 'తప్పుత్రోవల్లో' నడిచిన వెర్రి వెంగళాయిని కాను." నా మాటలు ఆమె హృదయంలోని అగ్నిమంటల్ని ఆర్పాయి. ఆమె గులాబీ పెదవులపై చిరునవ్వులు పుట్టాయి. "అలా ముందుగానే చెప్తేనో!" అంటూ శ్యామల నా హృదయంపై...

మానం భుజంగరావు.

* * *

## నిట్టూర్పు

మా తాతలనాడు, తండ్రులనాడు మేము కాఫీ అంటే యెట్టిదో యెరుగము. 'కాఫీ' అనేది ఒక పానీయమో లేక చలిమిడిముద్దవంటి ఒక ఫలహారమోకూడ మాకు తెలిసేది కాదు. ఆ రోజులలో మా అమాయకపు జీవితాలను చదువరులు గుర్తించాలి.

నా వివాహానంతరం అనగా క్రీ. శ. 1940 తరువాత కాఫీ అనే పానీయానికి నేను అలవాటు పడితిని. ఇప్పటికి షుమారు ఒక దశ కావచ్చింది. కాఫీ తయారగుటకు పంచదార, కాఫీగుండ, పాలు,నీరు అవసరమైన పదార్థములని అందరకు తెలిసిన జాబితాయే. అందు ప్రథమస్థానమందున్న పంచదారకు యీ నాడు కరువువొచ్చింది. వర్తకుల సంచులలో దాగున్న ఆ పదార్థము కుట్లు బిగిసినందువల్ల బయట పడుట దుర్లభము అయింది.

దేశంలో ప్రతి నగరములోను పంచదార కరువనియే పేవర్లు ఘోషించేయి. కాఫీ అలవాటు పడిన మహనీయులెల్ల 'బ్రతుకు తెరువేది దేవుడా!' అని గోలపెట్టుచుండిరి. కాఫీ తాగుబోతులకు ఇదియే నా సానుభూతి. ఇంతలో మా ఆవిడ 'పంచదార టిన్' కాళీ అని చెప్పింది. అప్పుడే విషాదముతో నేనొక వేడినిట్టూర్పు విడిచి-ఈ కార్డుపై ఆ నిట్టూర్పు చరిత్ర సూక్ష్మంగా తెలుపుకున్నాను.

మరువాడ సూర్యప్రకాశం.

## మదపిచ్చి

ప్రసాద్ పట్నంలో చదువుకొనుచున్నాడు. విశ్రాంతి సమయాలలో కాలేజీ లైబ్రరీయందు మామూలుప్రకారం పత్రికలు తిరగవేస్తున్న సమయంలో, ఒకప్రకటన ప్రసాద్‌కళ్లను ఆకర్షించింది. బుర్రలో అనేక ఆలోచనలు "బోనులోని యెలకల్లాగ" పరిగెట్టాయి. వెంటనే లాడ్జికిపోయి, ఒకలేఖ వ్రాసి, తన ఫోటోతోసహా ఆ లేఖను పోస్టుబాక్సు నెంబరు "111 బొబ్బిలి" అని యెడ్రసుకు పోస్టుచేశాడు. నాటినుండి ప్రసాద్‌లో క్రొత్తమార్పు కనబడుట ప్రారంభించాయి. రోజూ పోస్టాఫీసు చుట్టూ 'గ్రహాలకుమల్లె' పరిభ్రమించే వారి జాపితాలో వేయబడ్డా డిప్పుడు మనప్రసాద్. వారం రోజులకు ఒక వుత్తరం వచ్చింది. ఆ వుత్తరములో యిలాగ వ్రాసివుంది. "ఒరే! మదపిచ్చి వెధవా! 'వరుడు కావాలన్న ప్రకటన యెవరి కనుకొని నీవు నేనున్నానుగా' అని వ్రాశావురా? ఆప్రకటన మీచెల్లెలి పెళ్లికొరకు నేను పేపరులో ప్రకటింపచేసితిని! మీదు మిక్కిలి నీకు పెళ్లి అయిపోయినా యిలాటి దుర్బుద్ధి యెందుకు కలిగింది? అందరూ బాగుపడేటందులకు చదువుకొంటారు. కాని నీవు చెడిపోయేటందులకు చదువుకొనుచున్నట్లున్నావు. తక్షణం చదువు చాలించి ఇంటికి దయచేయవచ్చును. ఇక నీకు మదపిచ్చి లావైనట్లున్నది. నీకు మరి చదువు వంటబట్టదు..." మరి ప్రసాద్ వుత్తరము చదవలేకపోయాడు. తను చేసిన తెలివితక్కువ పనికంటె అందులో దొరికిపోయినందులకు చాలా విచారించాడు. కడకు యేమిచేసినా తానింటికి వచ్చి భార్యతో కాపరంచేయక తప్పిందికాదు. దాంతో కొంచెము మదపిచ్చి శాంతించింది. తాజాగావచ్చిన వార్తలప్రకారం ప్రసాద్ యిప్పుడు మడి దున్నుకొని వ్యవసాయంద్వారా ప్రభుత్వానికి, "అధిక ఆహారోత్పత్తి వుద్యమము"లో సహాయపడుతున్నాడని తెలుస్తున్నది. నిజముగా యిటువంటి పుత్రరత్నాన్ని కన్న భారతమాత ధన్యురాలు!

కె. జగన్నాథాచార్యులు.